ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 1 మే 2024



ఈసారి సముద్రం దొంగల వంతు

నడిసముద్రంలో నాగై జాలర్లపై దాడి ● రూ.3లక్షల వస్తువుల దోపిడీ



దొంగలదాడిలో గాయపడిన నాటుపడవ యజమాని మురుగన్

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా కోడియక్కరైకి ఆగ్నేయంగా సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో చేపలు పడుతున్న నలుగురు జాలర్లపై శ్రీలంకకు చెందిన సముద్రపు దొంగలు దాడి చేశారు. పడవలో ఉన్న రూ.3లక్షల విలువైన వలలు, జీపీఎస్ పరికరాలు, వాకీటాకీలు తదితర వస్తువులను దోచుకెళ్ళారు. నాగపట్టినం జిల్లా సెరుందూరు గ్రామానికి మురుగన్‌కు చెందిన నాటుపడవలో అక్కరపేట్టైకి చెందిన ముత్తు, మురుగవేల్, చిన్నయ్యన్ అనే జాలర్లు ఈ నెల 28 వేకువజాము సముద్రంలో చేపలవేటకు వెళ్ళారు. కోడియక్కరైకి ఆగ్నేయంగా వీరంతా చేపలుపడుతుండగా ప్లాస్టిక్ పడవల్లో వచ్చిన శ్రీలంక సముద్రపు దొంగలు చుట్టుముట్టారు. పడవలో ఉన్న చేపలు, వలలు, జీపీఎస్ పరికరాలు, వాకీటాకీలు, సెల్‌ఫోన్లు అప్పగించమని బెదరించారు. నలుగురు జాలర్లు వాటిని ఇచ్చేందుకు నిరాకరించడంతో సముద్రపు దొంగలు ఇనుప కమ్మీలు, కట్టెలతో చితకబాదారు. ఆ తర్వాత నాటుపడవలో ఉన్న రూ.3లక్షల విలువైన వస్తువులను దోచుకుని మాయమయ్యారు. ఈ దాడిలో నాటుపడవ యజమాని మురుగన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తక్కిన ముగ్గురూ స్వల్పంగా గాయపడ్డారు. ఆ తర్వాత నలుగురు జాలర్లు మంగళవారం వేకువజాము స్వస్థలానికి తిరిగొచ్చారు. గాయాలతో తిరిగొచ్చిన జాలర్లను చూసి స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తమం నాగై ఒరత్తూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై వేలాంగన్ని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రొఫెసర్ నిర్మలాదేవికి పదేళ్ల జైలు



నిర్మలాదేవి

పెరంబూర్, ఏప్రిల్ 30: కళాశాల విద్యార్థినులకు మాయమాటలు చెప్పి, వారిని వ్యభిచారం కూపంలోకి నెట్టేందుకు ప్రయత్నించారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ నిర్మాలాదేవికి న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించింది. విరుదునగర్ జిల్లా అరుప్పుకోటలో ఉన్న ప్రైవేటు కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నిర్మాలాదేవి విద్యార్థినులకు ఆశ చూపి తప్పుడు మార్గంలోకి పంపుతూ మాట్లాడే ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన అరుప్పుకోట పోలీసులు 2018 ఏప్రిల్ 16వ తేది నిర్మలాదేవిని అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును రాష్ట్రప్రభుత్వం సీబీసీఐడీకి బదిలీ చేసింది. అలాగే, ఈ కేసులో మదురై కామరాజర్ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ మురుగన్, పరిశోధన విద్యార్థి కరుప్పస్వామి కూడా అరెస్టయ్యారు. ఈ వ్యవహారంపై మాజీ ఐఏఎస్ అధికారి సంతానం నేతృత్వంలో విచారణ కమిటీని అప్పటి గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ నియమించారు. ఈ కేసు విచారణ శ్రీవిల్లిపుత్తూర్‌లోని జిల్లా ఫాస్ట్ ట్రాక్ మహిళా కోర్టులో జరిగింది. 2018 జూన్ 13వ తేది 1,160 పేజీల ఛార్జిషీటును సీబీసీఐడీ కోర్టులో ప్రవేశపెట్టింది. ఈ కేసు వాదోపవాదనల అనంతరం ఈ కేసులో అసిస్టెంట్ ప్రొఫెసర్ మురుగన్, పరిశోధన విద్యార్థి కరుప్పస్వామిలను గత నెల 29న నిర్దోషులుగా ప్రకటించిన న్యాయస్థానం, ఈ కేసులో ప్రొఫెసర్ నిర్మలా దేవి దోషి అని, ఆమెకు విధించే శిక్ష మంగళవారం ప్రకటిస్తామని తెలిపింది.ఈకేసులో నాలుగు సెక్షన్ల కింద నిర్మలా దేవిపై కేసు నమోదుకాగా,ఒక్కోసెక్షన్‌లో వేర్వేరు శిక్షలు కలిపి మొత్తం పదేళ్ల జైలు శిక్ష, రూ.2.45 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి భగవతి అమ్మాళ్ తీర్పు వెలువరించారు.

వడదెబ్బ చికిత్సకు 140 ఆస్పత్రులు సిద్ధం




ఆస్పత్రిని పరిశీలిస్తున్న నగర కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్

ప్యారీస్, ఏప్రిల్ 30: గ్రేటర్ చెన్నైలో ప్రస్తుతం ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల వల్ల కలిగే అనారోగ్య సమస్యలకు, వడదెబ్బకు అత్యవసర చికిత్స అందించేందుకు 140 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆస్పత్రుల్లో కల్పించిన సదుపాయాలను కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... నగరంలో భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరిగిపోతుందని, ఈ ఉష్ణోగ్రతల కారణంగా అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఇలాంటి తక్షణం వైద్య చికిత్సలు అందించేందుకు వీలుగా కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న 140 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. హీట్ స్ట్రోక్‌కు గురయ్యేవారికి చికిత్సలు అందించేందుకు ఈ ఆస్పత్రులు 24 గంటల పాటు పనిచేస్తాయన్నారు. అంతేకాకుండా, నగరంలో 188 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా రీ-హైడ్రోజన్ (ఓఆర్‌ఎస్) పానీయాన్ని పంపిణీ చేసే ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడే వారు జాగ్రత్తగా ఉండాలని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండలో తిరగడాన్ని మానుకోవాలని ఆయన సూచించారు.

ఫలితాల తర్వాత ప్రక్షాళన?

● మంత్రివర్గంలోనూ మార్పులు !



ఎడప్పాడి



అన్నామలై



సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత పాలకపక్షమైన డీఎంకే, ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సహా ప్రధాన పార్టీల్లో భారీ మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటముల మధ్య పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఘనవిజయం సాధించేందుకు మూడు కూటముల నేతలైన డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ నేత అన్నామలై సరికొత్త వ్యూహాలతో ప్రచారాలతో బరిలోకి దిగారు. ప్రస్తుతం జూన్ నాలుగునే దేశమంతా లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ నేపథ్యంలో ఈ మూడు పార్టీల నాయకులు తమకు ఏ నియోజకవర్గంలో విజయం వరిస్తుందోనంటూ తమ నేతల వద్ద ఆరా తీస్తున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఎన్ని నియోజకవరాల్లో గెలుస్తుందనే విషయంపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఇప్పటికే నివేదికను ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందజేసింది. పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలలోనూ డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆ నివేదికలో పేర్కొంది. ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన డీఎంకే అభ్యర్థులు, మిత్రపక్షాల అభ్యర్థులు స్టాలిన్‌ను కలుసుకుని తప్పకుండా గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేశారు. అయితే పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులకు మెజారిటీ తగ్గే అవకాశం ఉందని, రెండు మూడు సీట్లు కోల్పోయే అవకాశాలున్నాయని తెలుస్తోంది. అభ్యర్థుల విజయం కోసం, ప్రచార ఖర్చుల కోసం ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, జిల్లా శాఖ నేతలకు పార్టీ అధిష్ఠానం పంపిన సొమ్ము సక్రమంగా ఖర్చు చేయకపోవడమే దీనికి కారణమని చెబుతున్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్‌చార్జ్ మంత్రులపై ఎన్నికల ఫలితాల తర్వాత వేటు తప్పదని డీఎంకే సీనియర్ నేతలు చెబుతున్నారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థులు పొందిన ఓట్ల మెజారిటీ ఈ సారి చాలా చోట్ల తగ్గుతుందని, స్వల్పమెజారిటీతోనే గెలుస్తారని భావిస్తున్నారు. ఇక ఎన్నికల సమయంలో సక్రమంగా పనిచేయని ఇన్‌ఛార్జి మంత్రులపై కూడా స్టాలిన్ కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అంశాలన్నీ పరిశీలిస్తే జూన్ నాలుగు తర్వాత రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు తథ్యమని కూడా చెబుతున్నారు. ఎన్నికల్లో సక్రమంగా పనిచేయని మంత్రులకు పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఉద్వాసన పలుకుతారని తెలుస్తోంది.

అన్నాడీఎంకేలో...

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేత స్టాలిన్‌కు ధీటుగా అన్ని చోట్లా సుడిగాలి పర్యటన చేశారు. అయితే కొన్ని జిల్లాల్లో పార్టీ ఇన్‌ఛార్జిలు అభ్యర్థులకు సహకరించలేదని, పార్టీ అధిష్ఠానం పంపిన డబ్బు సక్రమంగా ఖర్చు చేయలేదని జిల్లా నేతల నుంచి ఫిర్యాదులందాయి. పార్టీ అభ్యర్థులను ఏయే ప్రాంతాలకు తీసుకెళ్ళి ప్రచారం చేయించాలనే విషయమై జిల్లా నేతలే రోజువారీ పర్యటన ఖరారు చేయాలనే ఈపీఎస్ సూచనలను పలు జిల్లాల్లో పట్టించుకోలేదు. వివిధ జిల్లాలు, లోక్‌సభ నియోజకవర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిశీలిస్తున్న ఈపీఎస్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత పార్టీ సీనియర్లయిన మాజీ మంత్రులపై కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు. పార్టీ వర్గాలు జరిపిన రహస్య సర్వే ప్రకారం కాంచీపురం, నార్త్ చెన్నై, సౌత్ చెన్నై, కళ్ళకురిచ్చి సహా 15 లోక్‌సభ నియోజకవర్గాలలో గెలుస్తామని ఈపీఎస్ సహా సీనియర్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే కంటే మెగా కూటమిని రూపొందించుకుని పోటీ చేసిన ఎన్డీఈయే (బీజేపీ) కూటమి వల్ల పార్టీ అభ్యర్థులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని కొందరు నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు సంగతి ఎలాగున్నా... ద్వితీయ స్థానంలోనైనా నిలిస్తేనే పార్టీకి మనుగడ ఉంటుందని లేకుంటే పార్టీ పతనస్థితికి చేరుతుందని మరికొంత మంది సీనియర్లు చెబుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ ఈ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, పార్టీ సీనియర్లు ఆందోళన చెందనవసరం లేదని, ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడండంటూ ఈపీఎస్ చెబుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ ఎన్నికల ఫలితాల తర్వాత అన్నాడీఎంకేలోనూ మార్పులు తథ్యమని తన సహచరులకు తెలిపారు.

బీజేపీలో...

రాష్ట్రంలో గణనీయ ఓట్లు సాధించాలని పట్టుదలగా వున్న బీజేపీ అధిష్ఠానం.. ఆ పార్టీ రాష్ట్ర నేతలపై అసంతృప్తితో వున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ మెగా కూటమి ఏర్పాటు చేసిందన్న సంతృప్తి మినహా, ఎన్నికల బరిలో పార్టీ నేతలు విజయం కోసం సక్రమంగా పనిచేయలేదని పార్టీ అధిష్ఠానానికి పలు నియోజకవర్గాల వర్గాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎన్నికల ఖర్చు కోసం కేటాయించిన నిధులను పలువురు నేతలు సక్రమంగా ఖర్చుపెట్టకుండా స్వాహా చేశారని, జాతీయ నాయకులు పాల్గొన్న బహిరంగ సభలు మినహా రాష్ట్రస్థాయి నాయకులు, కేంద్ర మంత్రులు పాల్గొన్న సభలకు జనాన్ని తరలించడంలోనూ పలువురు విఫలమైనట్లు తెలుసుకుని ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే దూరమైనా గెలుస్తామని పార్టీ రాష్ట్ర నాయకులు ధీమా వ్యక్తం చేసి పీఎంకే, అమ్మామక్కల్ మున్నేత్ర కళగం మరికొన్ని చిన్నాచితక పార్టీలతో పొత్తుపెట్టుకుని పోటీకి దిగడం తమకు పెద్ద నష్టమేనని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. ఏదీ ఏమైనప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో ఆశించినంత విజయాలు సాధించకుంటే బీజేపీ రాష్ట్రశాఖలోనూ కీలక మార్పులు సంభవించడం ఖాయమని బీజేపీ జాతీయ నాయకులు చెబుతున్నారు.



వేదారణ్యం సత్యాగ్రహ స్థూపం వద్ద ఉప్పు పట్టుకుని నినాదాలు చేస్తున్న సెల్వపెరుంతగై, కేవీ తంగబాలు తదితరులు

వేదారణ్యంలో ఉప్పు సత్యాగ్రహం స్మారక ర్యాలీ

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వేదారణ్యంలో ఉప్పు సత్యాగ్రహం 63వ స్మారక ర్యాలీని నిర్వహించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఉప్పు సత్యాగ్రహం ప్రధాన పాత్ర పోషించింది. తెల్లదొరలు ఉప్పుపై విధించిన పన్నుకు నిరసనగా గాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. దండిలో ఆయన ఉప్పు సత్యాగ్రహం నిర్వహించి ఆంగ్లేయుల అధికార పీఠంలో ప్రకంపనలు సృష్టించారు. గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు తమిళ కాంగ్రెస్ నేత చక్రవర్తి రాజగోపాలాచారి వేదారణ్యంలో ఉప్పు సత్యాగ్రహ ర్యాలీ నిర్వహించి కటకటాలపాలయ్యారు. ఆనాటి ఉప్పు సత్యాగ్రహ ర్యాలీని తలపించేలా టీఎన్‌సీసీ స్మారక ర్యాలీ నిర్వహించింది. ఉప్పు సత్యాగ్రహ యాత్ర కమిటీ అధ్యక్షుడు శక్తి సెల్వగణపతి నేతృత్వంలో తిరుచ్చిలో ఉప్పు సత్యాగ్రహ రాజన్ స్మారక మందిరం నుంచి పార్టీ నేతలు, ప్రముఖులు, కార్యకర్తలు ప్రదర్శనగా బయలుదేరారు. వేదారణ్యం ఉత్తరవీధిలో ఉన్న సత్యాగ్రహ స్మారక భవనంలో అందరూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం కాంగ్రెస్ నేతలు, ప్రముఖులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అగస్తియన్ పాఠశాల ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఉప్పు సత్యాగ్రహ స్మారక స్థూపం ప్రాంతంలో ఉప్పు నిల్వల్లో చేతులుంచి వందేమాతరం అంటూ నినాదాలు చేసి పిడికిట్లో ఉప్పు తీసుకుని ప్రదర్శన జరిపారు. ఆ సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు, మాజీ ఎంపీ రాజేంద్రన్, కేటిలియప్పన్ సహా వందలాదిమంది పాల్గొన్నారు.

ఏర్కాడు ఘాట్‌లో అదుపుతప్పిన బస్సు

● ఆరుగురి మృతి, 30 మందికి గాయాలు

పెరంబూర్, ఏప్రిల్ 30: ఏర్కాడులో మంగళవారం సాయంత్రం ఆమ్నీ బస్సు అదుపుతప్పిన ఘటనలో ఆరుగురు మృతిచెందగా, 30 మందికి గాయాలయ్యాయి. ఏర్కాడు నుంచి సేలం వైపు వెళ్తున్న ఆమ్నీ బస్సు కొండ మార్గంలోని 11వ ఘాట్ వద్ద మలుపు తిరుగుతూ హఠాత్తుగా అదుపు తప్పి 50 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఓ చిన్నారి సహా ఆరు గురు మృతిచెందారు. అలాగే, 30 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించిన ట్రాఫిక్ పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి మృతులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



ప్రమాద స్థలంలో సహాయక చర్యలు



● స్టాలిన్ సహా నేతల శుభాకాంక్షలు

నేడు శ్రామిక దినం

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్మిక సోదరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా రాజకీయ పార్టీల నాయకులు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సోదరులు మేడే జరుపుకుంటున్న సందర్భంగా ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపిన స్టాలిన్ డీఎంకే ప్రభుత్వ హయంలోనే కార్మికుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశామన్నారు. ఇటీవల తమ ప్రభుత్వం వస్త్రదుకాణాలలో పని చేసే కార్మికులు సిబ్బందికి నిలబడకుండా బల్లలు సమకూర్చాలని ప్రత్యేక చట్టం తీసుకువచ్చిందన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర వ్యాప్తంగా మేడే జరుపుకోనున్న కార్మికులందరికీ శుభాకాంక్షలని, కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉండేది తమ పార్టీయేనని పేర్కొన్నారు. ఇదే విధంగా ద్రావిడ కళగం నేత కే వీరమణి, టీఎంసీ నేత జీకే వాసన్, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, పెరుంతలైవర్ మక్కల్ కట్చి నాయకుడు ఎస్‌ఆర్ ధనపాలన్, అఖిల భారత కట్టడ కార్మికుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణన్ కార్మిక సోదరులందరికీ ఓ ప్రకటనలో మేడే శుభాకాంక్షలు తెలిపారు.

కొడైకెనాల్ ప్రవేశానికి ఈ-పాస్ విధానం

స్వాగతించిన స్థానికులు ● పెదవి విరుస్తున్న వ్యాపారులు

అడయార్, ఏప్రిల్ 30: కొడైకెనాల్, ఊటీ వంటి ప్రాంతాలకు సీజన్ సమయాల్లో పర్యాటకుల ప్రవేశానికి ఈ-పాస్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. దీనిపై కొడైకెనాల్ వాసులు స్వాగతిస్తుండగా, వ్యాపారులు మాత్రం పెదవి విరుస్తున్నారు. ఈ-పాస్ అమల్లోకి వస్తే కొడైకెనాల్ వంటి పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గి తమ వ్యాపారాలు దెబ్బతింటాయని వారు ఆందోళన చెందుతున్నారు. హైకోర్టు ఆదేశాలతో ఈ-పాస్ విధానాన్ని ఏ విధంగా అమలు చేయాలన్న అంశంపై రెవెన్యూ, అటవీ, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కలిసి ఒక ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశం తర్వాత ఈ-పాస్ విధానం అమలుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా ఈ-పాస్ కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందించాల్సి ఉంటుంది. ఈ వెబ్‌సైట్ రూపకల్పనపై కూడా అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు నిర్ణయంపై కొండ పర్యాటక ప్రాంతవాసులు స్పందిస్తూ.... కొడైకెనాల్, ఊటీ, నీలగిరి వంటి ప్రాంతాలకు వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ముఖ్యంగా వేసవిలో ఈ సంఖ్య అత్యధికంగా ఉంటుంది. ఈ కారణంగా వాహనాల రద్దీ నెలకొని ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. దీంతో స్థానికులు తమ దినచర్యలకు కూడా వెళ్ళలేని పరిస్థితి ఉత్పన్నమవుతుంది. దీనికితోడు వాహనాల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా పర్యాటక ప్రదేశాలు కళావిహీనంగా మారిపోవడమేకాకుండా, పర్యావరణం కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే హైకోర్టు జారీ చేసిన ఈ-పాస్ విధానాన్ని తాము స్వాగతిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ-పాస్ విధానం అమల్లోకి వస్తే కొండ పర్యాటక ప్రాంతాలకు ఒక రోజుకు ఎన్ని వాహనాలు వచ్చి వెళ్తాయనే విషయంపై ముందుగానే అవగాహన ఏర్పడుతుందని, వాహనాల రద్దీ తగ్గడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా కొంతమేరకు పరిష్కారమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.



కొడైకెనాల్‌లో పర్యాటకుల రద్దీ

కోవై స్థానం ఓట్ల లెక్కింపు నిలుపుదల చేయలేం

● హైకోర్టు స్పష్టీకరణ

అడయార్, ఏప్రిల్ 30: కోయంత్తూరు లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపును నిలుపుదల చేసి, పేర్లు గల్లంతయిన ఓటర్లను జాబితాలో చేర్చి మళ్ళీ ఓటు హక్కు కల్పించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. ముందుగా ప్రకటించినట్టుగా జూన్ 4వ తేదీ కోవై లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు యధావిధిగా జరుగుతుందని స్పష్టం చేసింది. ఆస్ట్రేలియాలో వైద్యుడిగా పనిచేస్తున్న కోయంబత్తూరు జిల్లా నెంజుండపట్టికి చెందిన సుందర కన్నన్ అనే వ్యక్తి మద్రాస్ హైకోర్టులో ఒక పిటిషన్ వేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆస్ట్రేలియా నుంచి కోయంబత్తూరుకు వచ్చారు. కానీ, ఓటర్ల జాబితాలో తన పేరు, తన భార్య పేరు లేదు. కానీ తన కుమారుడు పేరు మాత్రం ఉంది. అలాగే, తమ ఏరియాలో వందలాది మంది పేర్లు కూడా ఓటర్ల జాబితాలో గల్లంతయ్యాయి. అందువల్ల గల్లంతయిన ఓటర్ల పేర్లను మళ్ళీ జాబితాలో చేర్చి వారికి ఓటు హక్కు కల్పించిన తర్వాతే కోవై లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్‌వాలా సారథ్యంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సమయంలో ఎన్నికల సంఘం తరపున హాజరైన న్యాయవాది తమ వాదన వినిపించారు. ఓటర్ల జాబితాను జనవరిలో విడుదల చేయడం జరిగింది. పైగా పిటిషనర్ కోయంబత్తూరులో నివసించడం లేదు. ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పిటిషనర్ పేరు ఓటర్ల జాబితాలో తొలగించడం జరిగింది అని కోర్టుకు తెలిపారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన ధర్మాసనం.. జనవరిలో విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైనప్పటికీ పిటిషన్‌దారుడు ఎలాంటి ఆక్షేపణ వ్యక్తం చేయలేదు. పైగా రాష్ట్రంలో పోలింగ్ ముగిసిన తరుణంలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేం. లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపును నిలుపుదల చేసేలా ఆదేశించలేం' అని ధర్మాసనం పేర్కొంటూ కేసు విచారణ ముగించారు.

సమాచార ధ్వని

డిప్లొమో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: డిప్లొమో శిక్షణలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చెన్నై సహకార మేనేజ్‌మెంట్ కేంద్రంలో 2024-25వ సంవత్సరం ఫుల్ టైమ్ సహకార మేనేజ్‌మెంట్ డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు www.tncu1cm.com అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబరులో ప్రారంభమయ్యే కోర్సుల శిక్షణకు సంబంధించి వివరాలకు 25360041 నెంబరులో సంప్రదించవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిల్మ్ అండ్ టెలివిజన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 30: తమిళనాడు ప్రభుత్వ ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ శిక్షణ సంస్థలో 2024-25 విద్యా సంవత్సరానికి పలు కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టనుంది. బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ (సినిమాటోగ్రఫీ), బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ (డిజిటల్ ఇంటర్మీడియట్), ఆడియోగ్రఫీ, డైరెక్షన్ అండ్ స్క్రీన్‌ప్లే రైటింగ్, ఫిల్మ్ ఎడిటింగ్, యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ తదితర కోర్సులు అందిస్తోంది. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 2 నుంచి 20వ తేదిలోగా www.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి తగిన సర్టిఫికెట్లతో 'ప్రిన్సిపాల్, తమిళనాడు ప్రభుత్వ ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ శిక్షణా కేంద్రం, సీఐటీ కాంప్లెక్స్, తరమణి, చెన్నై-600113' చిరునామాలో ఈ నెల 27వ తేది సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలి.

ఎలిఫెంట్ వే పై ప్రజాభిప్రాయ సేకరణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: రాష్ట్రంలో ఏనుగుల మార్గాల భద్రతకు సంబంధించిన పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగనుంది. రాష్ట్రంలో పశ్చిమ, తూర్పు కనుమల్లో ఏనుగులు ఎక్కువగా నివసిస్తున్నాయి. 2023 సంవత్సరం గణాంకాల ప్రకారం 2,961 ఏనుగులున్నట్లు తెలిసింది. వ్యవసాయ భూముల కోసం అడవుల ఆక్రమణ, అభివృద్ధి పనులు వంటి కారణాలతో ఏనుగుల మార్గాలు పలుచోట్ల కనుమరుగవుతున్నాయి. దీంతో ఏనుగులు జనావాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయి. వాటి మార్గాల భద్రత కోసం అటవీ శాఖ ప్రత్యేక పథకం రూపొందించింది. దీనికై ప్రజలు www.forest-s.tn.gov.in/ tnforestdeptpublication అనే వెబ్‌సైట్, elephant-corridortnfd@ gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాలో తమ అభిప్రాయాలు తెలయజేయాలని అటవీ శాఖ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

నేటినుంచి సర్ఫింగ్ పోటీలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: నగరంలో బుధవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు సర్ఫింగ్ పోటీలు జరుగనున్నాయి. చెన్నై హార్బర్ నుంచి మహాబలిపురం వరకు వెళ్లి తిరిగి వచ్చేలా (10 గంటల పాటు) పోటీలు ఏర్పాటు చేశారు. కేంద్ర నావికాదళం, కోస్టుగార్డు అధికారుల అనుమతితో చెన్నై సర్ఫింగ్ క్లబ్ ఈ పోటీలు నిర్వహిస్తోంది. అంతర్జాతీయ సర్ఫింగ్ క్రీడాకారులు పాల్గొంటున్న ఈ పోటీలను యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ కార్యదర్శి అతుల్యా మిశ్రా ప్రారంభించనున్నారు.

నేటినుంచి లక్షార్చన

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: స్థానిక తిరువొత్తియూరు దక్షిణ మూర్తి ఆలయంలో బుధ, గురువారాల్లో గురుపెయర్చిని పురస్కరించుకుని లక్షార్చన జరుగనుంది. బుధవారం సాయంత్రం 5.19 గంటలకు గురుభగవానుడు మేషరాశి నుంచి వృషభ రాశిలోకి ప్రవేశిస్తున్నారు. ఆ ప్రకారం గురుపెయర్చి రోజైన బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి గణపతి హోమం, గురుపెయర్చి పరిహార హోమం, 108 మూలికలు, హోమ ద్రవ్యాలు కలిపిన కలశతీర్థంతో విశేషాభిషేకం, మహాదీపారాధన జరుగనున్నాయి. గురువారం ఉదయం 9 గంటల నుంచి లక్షార్చన, శుక్రవారం రుద్రాభిషేకం జరుగనున్నాయి.

18కి 'నెట్ పరీక్ష వాయిదా

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: నెట్ పరీక్ష జూన్ 18వ తేదీకి వాయిదా వేశారు. సహాయ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హత పరీక్ష (నెట్) జూన్ 16వ తేదీన నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అదే రోజున వివిధ సర్వీసుల ప్రిలిమినరీ పరీక్షలు జరుగనుండడంతో నెట్ పరీక్ష 18వ తేదీకి యూజీసీ వాయిదా వేసింది. పలువురు అభ్యర్థుల వినతి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష తేదీకి పది రోజుల ముందు ఏజెన్సీ వెబ్‌సైట్‌లో పరీక్షా కేంద్రాల వివరాలు విడుదల చేస్తామని వారు వివరించారు.

ఐల్యాండ్ గ్రౌండ్‌కు బ్రాడ్ వే బస్టాండ్ తరలింపు

పెరంబూర్, ఏప్రిల్ 30: స్థానిక బ్రాడ్‌వే బస్టాండ్‌ను తాత్కాలికంగా ఐల్యాండ్ గ్రౌండ్‌కు మార్చాలని నిర్ణయించారు. 'మల్టీ లెవల్ ఇంటిగ్రేషన్' పేరిట బ్రాడ్ వే బస్ టెర్మినల్‌ను పునరుద్ధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదంతస్తులతో కూడిన ఈబస్టాండ్‌లో వాణిజ్య కాంప్లెక్స్, సినిమాథియేటర్లు,షాపింగ్ మాల్స్‌తదితరాలు ఉంటాయి. మెట్రో రైల్వేస్టేషన్, సబర్బన్ రైల్వేస్టేషన్లను ఈ బస్ టెర్మినల్‌తో అనుసంధానం చేసేలా ఏడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటుకానున్నాయి.ఈనిర్మాణ పనుల కారణంగా కొద్దిరోజుల్లో బ్రాడ్ వే బస్టాండ్‌ను ఐల్యాండ్ గ్రౌండ్స్‌కు మార్చాలని సీఎండీఏ నిర్ణయించినట్లు సమాచారం.

మెట్రో స్తంభాలపై ప్రకటనలకు ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: మెట్రోరైలు ఫ్లై ఓవర్ స్తంభాలపై ప్రకటనలు చేసేందుకు ముందుకు రావాలని ప్రైవేటు సంస్థలను సీఎంఆర్ఎల్ ఆహ్వానిస్తోంది. ఇదివరకే ఈ స్తంభాలపై గీసిన చిత్రలేఖనాలు తొలగించి ప్రకటనల ద్వారా ఆదాయం ఆర్జించేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రకటనలు పొందేందుకు టెండర్లు విడుదల చేశామని, ఆలందూర్, సెయింట్ థామస్ మౌంట్, చిన్నమలై, తిరుమంగళం, అశోక్ నగర్, తిరువొత్తియూర్, గిండి, సైదాపేట, వాషర్‌మెన్‌పేట తదితర ప్రాంతాల్లో ఉన్న మెట్రో ఫ్లై ఓవర్ స్తంభాలపై ప్రకటనలు చేసేందుకు అనుమతించామని అధికారులు తెలిపారు.

నేటినుంచి హైకోర్టుకు సెలవులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: మద్రాస్ హైకోర్టు, మదురై డివిజన్ బెంచ్‌లకు బుధవారం నుంచి జూన్ 2వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ ప్రధాన రిజిస్ట్రార్ ఎం.జ్యోతిరామన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుల్లో మే 6, 7 తేదీల్లో పిటిషన్ దాఖలు చేయవచ్చని, 8, 9 తేదీల్లో విచారణ జరుగుతుందని తెలిపారు. అత్యవసర పిటిషన్లను మద్రాస్ హైకోర్టులో 8, 9తేదీల్లో న్యాయమూర్తులు జగదీష్ చంద్ర, కుమరేష్ బాబు, కలైమణి మే 15, 16 తేదీల్లో న్యాయమూర్తులు ఆషా, సెంథిల్ కుమార్, శక్తివేల్, 22, 23 తేదీల్లో స్వామినాథన్, బాలాజీ, శరవణన్, 29, 30 తేదీల్లో మహాదేవన్, లక్ష్మీనారాయణ ప్రసాద్, సౌందర్ విచారణ చేపడతారన్నారు. అలాగే మదురై డివిజన్ బెంచ్‌లో అవే తేదీల్లో న్యాయమూర్తులు వేల్ మురుగన్, ధనపాల్, అబ్దుల్ ఖుద్దూస్, రాజశేఖర్, పి.వేల్‌మురుగన్, వడమలై, కుమరప్పన్, మంజుల, విజయకుమార్, విక్టోరియా గౌరీ విచారణ చేపడతారు.

టీఎన్‌పీఎస్సీ పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 30: అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదలయ్యాయి. 159 పోస్టులకు ఫిబ్రవరి 7వ తేది రాతపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాలను మంగళవారం టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు.

తేని స్ట్రాంగ్ రూమ్‌లో చొరబడిన యువకుడి అరెస్టు

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తేని లోక్‌సభ నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రతా వలయాన్ని దాటుకుని చొరబడిన రాజేష్ కన్నన్ అనే యువకుడిని అరెస్టు చేశారు. తేని లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కంభం, పెరియకుళం, ఆండిపట్టి, బోడినాయకనూరు, చోళవందాన్, ఉసిలంపట్టి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు నమోదైన ఈవీఎంలను కొడువిలార్‌పట్టినిలోని కమ్మవార్ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. ఆ ప్రాంగణమంతా మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నలువైపులా సీసీ కెమెరాలు అమర్చి రోజూ పార్టీల అభ్యర్థుల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు వంతులవారీగా కాపలా కాస్తున్నారు. ఇంతటి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో కూడిన ఆ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు ఓ యువకుడు చొరబడ్డాడు. ఈ దృశ్యం సీసీ కెమెరా ద్వారా కంట్రోలు రూమ్ నుంచి పరిశీలించిన పోలీసులు అప్రమత్తమై హుటాహుటిన వెళ్ళి ఆ యువకుడిని పట్టుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఆ యువకుడు తేనికి చెందిన రాజేష్ కన్నన్‌గా గుర్తించారు. ఆయన మద్యం మత్తులో ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

13వ శతాబ్దం నాటి శిలాశాసనం లభ్యం

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: కళ్లకుర్చి జిల్లా తావైరెడ్డి గ్రామంలో 13వ శతాబ్దానికి చెందిన రెండు శిలాశాసనాలు లభ్యమయ్యాయి. ఈ గ్రామంలోని చెరువు తీరంలో సోమవారం పక్షుల గణన చేపట్టిన ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులు వీటిని గుర్తించారు. వీటి గురించి పురావస్తు పరిశోధకులకు సమాచారమిచ్చారు. జలాశయం సమీపంలో వున్న అమ్మనార్ ఆలయానికి చేరుకున్న పురావస్తు పరిశోధనలు 30 సెం.మీ ఎత్తు, 110 సెం.మీ వెడల్పు వున్న అయ్యనార్ విగ్రహం, 190 సెం.మీ ఎత్తు, 160 సెం.మీ వెడల్పు వున్న ఏనుగు శిల్పాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు శాసనాలు 13వ శతాబ్దానికి చెందినవని పురావస్తు శాఖ అధికారులు తెలిపారు.

మాస్క్ ధరించడం శ్రేయస్కరం

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: బర్డ్‌ఫ్లూ వ్యాపించకుండా మాస్క్ ధరించడం శ్రేయస్కరమని ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. కేరళలో ఈ వ్యాధి వ్యాపించి ఉండడంతో రాష్ట్రంలో ఆరోగ్యశాఖ మార్గదర్శక విధానాలు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆరోగ్యశాఖ పంపిన సర్క్యులర్‌లో ... బర్డ్‌ఫ్లూకు గురైన కోళ్లు, పక్షుల వల్ల ప్రజలకు ఈ వ్యాధి సోకే అవకాశముందని, వెటర్నరీ వైద్యులతో కలిసి వ్యాధి నిరోధక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, మాస్క్ ధరించడం వంటివి చేయాలని ప్రజలకు సూచించారు.

నేడు ఆదివారం టైంటేబుల్‌తో సబర్బన్ రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 30: నగరం, శివారు ప్రాంతాలకు నడుపుతున్న సబర్బన్ రైళ్లు ఆదివారం టైంటేబుల్ ప్రకారం బుధవారం నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ సెలవు రోజుల్లో ఆదివారం లాగా సబర్బన్ రైళ్లు తక్కువ సంఖ్యలో నడుస్తుంటాయి. కార్మిక దినోత్సవమైన బుధవారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో చెన్నై సెంట్రల్-అరక్కోణం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి, చెన్నై బీచ్-తాంబరం, ఎమ్మార్టీఎస్ రైళ్లు ఆదివారం టైంటేబుల్‌తో నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

మెట్రో రైళ్లు... : బుధవారం మెట్రో రైళ్లు శనివారం టైంటేబుల్ ప్రకారం నడుపనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రోరైళ్లు నడవనున్నాయి. ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు 6 నిముషాలకు ఒక రైలు, తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 8 గంటలు, 11 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 7 నిముషాలకు ఒక రైలు నడుపనున్నారు. అలాగే, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిముషాలకు ఒక రైలు నడుపనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

వేసవి ప్రత్యేక రైళ్లు


పెరంబూర్, ఏప్రిల్ 30: వేసవి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నరసాపురం- బెంగళూరు (వయా. కాట్పాడి, జోలార్‌పేట) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. నెం.07153 నరసాపురం- బెంగుళూరు ప్రత్యేక రైలు ఈనెల 3,10,17,24,31, జూన్ 7,14,21,28 (శుక్రవారం) తేదీల్లో నరసాపురంలో మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07153 బెంగళూరు-నరసాపురం ప్రత్యేక రైలు ఈనెల 4,11,18,25, జూన్ 1,8,15,22,29 (శనివారం) తేదీల్లో ఉదయం 10.50 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.

తాంబరం-సంత్రాగచ్చి... : నెం.06089 తాంబరం-సంత్రాగచ్చి వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 81,5,22,29 (బుధవారం) తేదీల్లో తాంబరం నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 9.20 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06090 సంత్రాగచ్చి-తాంబరం వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 9,16,23,30 (గురువారం) తేదీల్లో రాత్రి 10.40 గంటలకు సంత్రాగచ్చిలో బయల్దేరి మూడో రోజు ఉదయం 9.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

సెంథిల్ బాలాజీకి 36వసారి రిమాండ్ పొడిగింపు

ప్యారీస్, ఏప్రిల్ 30: అక్రమార్జన కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, డీఎంకే నేత సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 36వ సారి కోర్టు పొడిగించింది. ఆయనకు జూన్ 14వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ మంగళవారం కోర్టు ఆదేశించింది. రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో సెంథిల్ బాలాజీ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్టు ఈడీ గుర్తించి, గత యేడాది జూన్ 14వ తేదీన అరెస్టు చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన్ని కొన్ని రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపిన ఈడీ అధికారులు ఆ తర్వాత జ్యుడీషియల్ రిమాండ్‌కు పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సెంథిల్ బాలాజీ చెన్నై ప్రిన్సిపల్ కోర్టు, మద్రాస్ హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆయనకు ఒక్క కోర్టు కూడా బెయిల్ మంజూరు చేయలేదు. దీంతో ఆయన గత కొన్ని నెలలుగా రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రిమాండ్ మంగళవారంతో ముగియడంతో మరోమారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెంథిల్ బాలాజీని కోర్టులో హాజరుపరిచగా, జూన్ 4వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి అల్లీ ఉత్తర్వులు జారీ చేశారు.

పల్లడం తాలూకాఫీసుకు చెత్తబుట్టలతో తరలివచ్చిన జనం


పల్లడం తాలూకా కార్యాలయంలో చెత్త కుప్పలు పట్టుకుని వినతి పత్రం సమర్పిస్తున్న స్థానికులు

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా పల్లడం తాలూకా కార్యాలయంలో చెత్త కుప్పలతో స్థానికులు ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించడం తీవ్ర కలకలం సృష్టించింది. కరైపుత్తూరు ప్రాంతంలో చెత్తకుప్పలు వేసే డంపింగ్ యార్డ్ తొలగించాలని కోర్టు ఉత్తర్వు జారీ చేసి నెలలు దాటినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. చెత్తకుప్పల కారణంగా పిల్లల నుంచి పెద్దల వరకు రోగాలపాలవుతున్నారంటూ సంఘసేవకుల సమాఖ్య అధ్యక్షుడు అన్నాదురై నాయకత్వంలో సుమారు 50 మంది తాలూకా కార్యాలయంలో చెత్తబట్టులతో వెళ్లి తహసీల్దార్ జీవాకు వినతి పత్రం సమర్పించారు.

ఊబకాయానికి చికిత్స: యువకుడి మృతి

అడయార్, ఏప్రిల్ 30: స్థానిక పల్లావరంలో యూట్యూబ్‌లో వచ్చిన ఒక యాడ్ చూసి ఊబకాయానికి చికిత్స చేసుకున్న ఒక యువకుడు మరణించాడు. మంగళవారం వెలుగులోకి వచ్చిన ఈ విషాదకర ఘటన వివరాలను పరిశీలిస్తే, పుదుచ్చేరి తిరువళ్లువర్ నగర్‌కు చెందిన హేమచంద్రన్ (26) అనే యువకుడు నగరంలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి ఊబకాయంతో బాధపడుతున్న హేమచంద్రన్.. 150 కిలోల బరువు పెరిగాడు. ఈ క్రమంలో యూట్యూబ్ చానెల్‌లో ప్రసారమైన యాడ్ చూసి, పమ్మల్‌లో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరి ఊబకాయానికి గత 22వ తేదీ చికిత్స చేయించుకున్నాడు. ఆ తర్వాత హేమచంద్రన్ మరింత అస్వస్థతకు లోనయ్యాడు. దీంతో మెరుగైన చికిత్స కోసం క్రోంపేటలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఆగ్రహించిన హేమచంద్రన్ తల్లిదండ్రులు పమ్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. అంతేకాకుండా తప్పుడు చికిత్స కారణంగా తమ కుమారుడు చనిపోయాడని పేర్కొంటూ పంబల్ శంకర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, సీఎం సెల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి స్టాలిన్ కల్పించుకుని ఈ అంశంపై పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ఉన్నతాధికారుల బృందం.. హేమచంద్రన్‌కు చికిత్స చేసిన వైద్యులు, నర్సులను విచారిస్తున్నారు.

10 వరకు వళ్లలార్ కేంద్ర నిర్మాణ పనుల నిలిపివేత

పెరంబూర్, ఏప్రిల్ 30: వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణ పనులు ఈనెల 10వ తేది వరకు నిలిపివేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేంద్రం నిర్మాణంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేయగా, పలువురు మద్దతు తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటుపై దాఖలైన పిటిషన్లు విచారించిన హైకోర్టు, ఈ ప్రాంతాన్ని పురావస్తు శాఖ నిపుణుల బృందం తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, నిర్మాణపనులను ఈ నెల 10వ తేది వరకు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రూ.4 కోట్ల వ్యవహారంలో ముగ్గురికి సీబీసీఐడీ సమన్లు

అడయార్, ఏప్రిల్ 30: స్థానిక తాంబరం రైల్వే స్టేషన్‌లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్న కేసులో సీబీసీఐడీ ముగ్గురికి సమన్లు పంపింది. తిరునెల్వేలి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటల్ నుంచి రూ.4 కోట్లు తరలిస్తుండగా, తాంబరం రైల్వే స్టేషన్‌లో తాంబరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సతీష్, నవీన్, పెరుమాళ్ అనే వారిపై తాంబరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను తాంబరం పోలీసుల నుంచి సీబీసీఐడీ బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన సీబీసీఐడీ అధికారులు... సతీష్, నవీన్, పెరుమాళ్ అనే వారికి సమన్లు జారీ చేశారు.

రూ.49కి సినిమా ప్లస్, ఓటీటీ

ఐసిఎఫ్, ఏప్రిల్ 30: ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ సినిమా ప్లస్, స్టార్ ప్యాక్ ఓటీటీ సేవలు 50 శాతం రాయితీతో రూ.49లకు లభిస్తున్నాయి. నెల, 6 నెలలు, 12 నెలలు చందా చెల్లించి ఈ సేవలు పొందవచ్చు. ఇందులో లయన్స్ గేట్, షీమారో మీ, హంగామా, ఎపిక్ ఆన్ వంటి ఓటీటీ ప్రసారాలు పొందవచ్చు. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ అధికారులు మాట్లాడుతూ... రూ.100 ఫుల్ ప్యాక్‌లో జీ5, సోని లైవ్, ఎఫ్ టీవీ, డిస్నీ ప్లస్, హాట్ స్టార్ ఓటీటీలను చూడవచ్చు. రూ.249 ప్రీమియం ప్యాక్‌లో లయన్స్ గేట్, షిమోరో మీ, హంగామా, ఎడిక్ ఆన్, జీ5, సోనీ లైవ్, ఎఫ్ టీవీ, డీస్నీ ప్లస్ వంటివి వీక్షించవచ్చు. ఫైబర్ వినియోగదారులు తమ బ్రాడ్ బ్యాండ్ ఛార్జీతో కలిపి ఈ సేవలు పొందవచ్చని, ఇతర వివరాలకు బీఎస్ఎన్ఎల్ వెబ్‌సైట్ సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

వేలూరు మాజీ కమిషనర్‌కు మూడేళ్ల జైలు

వేలూరు, ఏప్రిల్ 30: వేలూరు కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి కేసులో మాజీ కమిషనర్‌కు కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించింది. కార్పొరేషన్‌లో 2017వ సంవత్సరం డెంగ్యూ దోమల నిర్మూలన కాంట్రాక్ట్ పొందిన బాలాజీ కి రూ.10.22 లక్షల బకాయిలు చెల్లించాలంటే అప్పటి కమిషనర్ కుమార్ రూ.20 వేలు లంచం అడిగినట్లు సమాచారం. ఈ డబ్బును కమిషనర్‌కు బాలాజీ అందజేస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసు విచారిస్తున్న వేలూరు జిల్లా ప్రధాన క్రైం కోర్టు, అప్పటి కమిషనర్ కుమార్‌కు మూడేళ్ళ జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది.

రామచంద్ర యాదవ్‌పై దాడి గర్హనీయం

● ద్రావిడ దేశం కృష్ణారావు

అడయార్, ఏప్రిల్ 30: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌పై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరులు అరాచకంగా దాడికి పాల్పడడంపై ద్రావిడ దేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. జిల్లాలోని సదుం మండలం ఎర్రతివారిపల్లె గ్రామంలో రామచంద్ర యాదవ్ ప్రచారం చేస్తుండగా మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు చేసిన దాడిపై కృష్ణారావు స్పందించారు. మంత్రి పెద్దిరెడ్డి అనుచరులుగా చెబుతున్న కొంతమంది అల్లరి మూకలు బీసీవై పార్టీ కార్యకర్తలను తీవ్రంగా కొట్టడమే కాకుండా, పలు వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పటించి తగలబెట్టడం, వాహనాలపై రాళ్ళతో దాడి చేయడం వంటి ప్రజావ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తర్వాత రెండే రెండు వర్గాలు ఆంధ్రరాష్ట్ర రాజకీయాలను శాసిస్తూ, సంఖ్యాపరంగా ఎక్కువ శాతం జనాభా కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారిని కేవలం తమ ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటూ, ఈ వర్గాల వారికి రాజ్యాధికారం దక్కకుండా చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల బడుగు, బలహీన వర్గాల వారు కలిసి ఏర్పాటు చేసుకున్న బీసీవై పార్టీని ఎదగకుండా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలను ఏమాత్రం పట్టించుకోకుండా ధైర్యంగా దూసుకెళుతున్న రామచంద్ర యాదవ్‌పై దాడి చేయడం అమానుష చర్యగా కృష్ణారావు అభిప్రాయపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి


అన్నామలై (ఫైల్‌ఫొటో)

వేలూరు, ఏప్రిల్ 30: నాట్రాంపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీసు మృతి చెందాడు. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో అన్నామలై కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. నాట్రాంపట్టి వద్ద ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదానికి గురైన అన్నామలై వేలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యుల కోరిక మేరకు అన్నామలై కళ్లను దానంగా అందజేశారు.

ఎంటీసీ బస్సు ఢీకొని ఐటీఐ విద్యార్థి మృతి

అడయార్, ఏప్రిల్ 30: స్థానిక పెరంబూరులో ఎంటీసీ బస్సు ఢీకొనడంతో ఐటీఐ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పెరంబూరు తిల్లైనాయకం రెండో వీధికి చెందిన అంబున్ రాజ్ కుమారుడు వేంబు విశ్వ (18) ఐటీఐ కోర్సు చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం తన స్నేహితుడి ద్విచక్రవాహనాన్ని తీసుకుని పెరంబూరు పేపర్ మిల్స్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఎంటీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విశ్వను సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు తెలిపారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆరుగురి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 30: ప్రస్తుతం అంతటా ఐపీఎల్ ఫీవర్ ఉంది. మ్యాచ్‌ల్లో ఎవరు గెలుస్తారనే విషయం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. అదే సమయంలో ఏ జట్టు గెలుస్తుంది అనే అంశంపై కూడా పలువురు బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో షావుకారుపేట పెరుమాళ్ మొదటి వీధిలోని సెల్‌ఫోన్ దుకాణంలో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందనే సమాచారంతో ఎస్ప్లినేడ్ పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. ఆ సమయంలో బెట్టింగ్ నిర్వహిస్తున్న సైదాపేట పెరుమాళ్ మొదటి వీధికి చెందిన సందీప్, షావుకారుపేటకు చెందిన కత్రేష్, రాజేష్ కుమార్, ధీరజ్, అంకిత్‌జైన్, జితేందర్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి 20,300 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఏఐఆర్ఎఫ్ అధ్యక్షుడిగా కన్నయ్య ఐదో సారి ఎంపిక



ప్యారీస్, ఏప్రిల్ 30: ఆలిండియా రైల్వే ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) అధ్యక్షుడిగా ఎస్ఆర్ఎంయూ ప్రధాన కార్యదర్శి డా.ఎన్.కన్నయ్య ఐదోసారి ఎంపికయ్యారు. కొంకన్ రైల్వే సహా దేశంలోని 19 రైల్వే జోన్లు, ఐసిఎఫ్ సహా ఏడు ఉత్పత్తి కేంద్రాలను కలుపుకొని ఉన్న ఏఐఆర్ఎఫ్ ఇటీవల 101 వసంతంలోకి అడుగుపెట్టింది. సుమారు 12 లక్షల మంది రైల్వే కార్మికుల మద్దతు పొంది గుర్తింపు పొందిన ఏఐఆర్ఎఫ్ అధ్యక్షుడిగా జె.ప్రకాష్ నారాయణన్, మాజీ రాష్ట్రపతి వీవీ గిరి, మాజీ రైల్వే మంత్రులు జార్జి ఫెర్నాండెజ్, మధుదండావతే, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు తదితర ప్రముఖులు వ్యవహరించారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన ఏఐఆర్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశం కన్నయ్యను ఐదోసారి అధ్యక్షుడిగా ఎన్నుకుంది. 2004 తర్వాత రైల్వే శాఖలో పరిచయం చేసిన కొత్త పింఛన్ విధానం రద్దు చేయాలని కన్నయ్య రైల్వే కార్మిక సంక్షేమ సంఘాలతో కలసి పోరాటం చేస్తూనే ఉన్నారు. ఏఐఆర్ఎఫ్ అధ్యక్షుడిగా ఎంపికైన ఆయనకు పలువురు ప్రముఖులు, రైల్వే కార్మిక సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా గంగమ్మ శిరస్సు వేడుకలు


ప్రత్యేక అలంకరణంలో అమ్మవారు

వేలూరు, ఏప్రిల్ 30: కేవీ కుప్పం డివిజన్ కీల్ అలత్తూర్ గ్రామంలో మంగళవారం గంగమ్మ శిరస్సు వేడుకలు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగాఇ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, దీపారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారి శిరస్సును ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ వేడుకల్లో పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎస్ఏ బేకరీ నిర్వాహకులు వి.పెరుమాళ్, భరత్‌కుమార్, వారి కుటుంబసభ్యులు మజ్జిగ, నీరు, పానకం అందజేశారు.

తిరునల్వేలి మాంజోలై ప్రాంతంలో అకాల వర్షం


మాంజోలై ఎస్టేట్ ప్రాంతంలో వర్షం

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా మాంజోలై ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి వాతావరణం చల్లబడింది. వారం రోజులుగా ఎండ వేడికి తల్లడిల్లిన స్థానికులు ఈ వర్షానికి ఊరట చెందారు. గంటపాటు కురిసిన ఈ వర్షానికి మాంజోలై తేయాకు తోటల్లో వర్షపునీరు వరదలా ప్రవహించింది. మాంజోలైలో సుమారు 33 మి.మీ.ల మేర వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. అంతేకాకుండా కాక్కాచ్చిలో 22మి.మీ.లు, నాలుముక్కు ఎస్టేట్‌లో 21 మి.మీ.లు చొప్పున వర్షం కురిసినట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్కలు నాటుతున్న జైళ్ల శాఖ అధికారులు, దినేష్ శరవణన్

వేలూరు, ఏప్రిల్ 30: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని సమాజ సేవకుడు దినేష్ శరవణన్ పిలుపునిచ్చారు. స్థానిక అలమేలు రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్ తన స్నేహితులతో కలసి సమాజ సేవా కార్యక్రమా లు చేపడుతుంటారు. ఈ క్రమంలో, తొరప్పాడి జైలు ప్రాంగణంలో గతంలో ఆయన మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. తాజాగా జైలు ప్రాంగణంలో 500 మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తమిళనాడు జైళ్ల శాఖ డైరెక్టర్ (డీజీపీ) అమరేష్ పూజారి హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఐజీ సెందామలై కన్నన్, జైళ్ల శాఖ ఎస్పీ అబ్దుల్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

భర్త నుంచి విడాకులు కోరిన భార్య

● ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య

అడయార్, ఏప్రిల్ 30: భర్త నుంచి విడాకులు కోరిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన దిండిగల్ జిల్లాలో జరిగింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, జిల్లాలోని తాడికొంబు ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ (42) స్థానికంగా టూవీలర్ సర్వీస్ స్టేషన్ నడుపుతున్నారు. ఈయనకు భార్య మేనక, భవానీ, తాన్యశ్రీ అనే ఇద్దరు పిల్లలున్నారు. అయితే, భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా మేనక... భర్త నుంచి విడాకులు కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం తన ఇద్దరు పిల్లలతో కలిసి మేనక ఇంటిలోనే ఆత్మహత్య చేసుకుంది. రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వెళ్ళిన శ్రీనివాసన్ తన భార్యపిల్లలు విగతజీవులుగా పడివుండటాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

ప్యారీస్, ఏప్రిల్ 30: చెంగల్పట్టు జిల్లా గుడువాంజేరి రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ బోర్డు కార్యాలయం సమీపంలో ఓ బస్సు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. స్థానిక చిట్లపాక్కంకు చెందిన మేఘరాజ్ (29) తన బుల్లెట్ వాహనంలో, మాడంబాక్కం రామ్‌నగర్‌కు చెందిన సంతోష్ (23) తన బైక్‌లో చెంగల్పట్టు నుంచి తాంబరంకు బయల్దేరారు. వారు గుడువాంజేరి ఈబీ కార్యాలయం వద్దకు చేరుకున్న సమయంలో ఎదురుగా వచ్చిన ఓ కర్మాగారం బస్సు అదుపుతప్పి రెండు మోటార్ సైకిళ్లను ఢీకొంది. అందులో తీవ్రంగా గాయపడిన మేఘరాజ్, సంతోష్ ఘటనా స్థలంలోనే మరణించారు.సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న ట్రాఫిక్‌విభాగం పోలీసులు, మృతదేహాలకు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి ఇద్దరు మృతికి కారణమైన బస్సు డ్రైవర్ ఆలందూర్‌కు చెందిన ఏలుమలై(37)ను అరెస్ట్ చేశారు.

కొడనాడు కేసు .... సీబీసీఐడీ విచారణకు నలుగురి హాజరు

ప్యారీస్, ఏప్రిల్ 30: నీలగిరి జిల్లా కోతగిరి సమీపంలోని కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ కేసు విచారణ నిమిత్తం ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు మంగళవారం కోవైలోని సీబీసీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. 2017 ఏప్రిల్ 24వ తేది దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్ బంగ్లాలో హత్య, దోపిడీ సంఘటనలు జరిగాయి. ఈ కేసుకు సంబంధించి 2021 అక్టోబరు 25న జయలలిత కారు డ్రైవర్ కనకరాజ్ సోదరుడు ధనపాల్, అతని మిత్రుడు రమేష్‌లను అరెస్ట్ చేశారు. 2022వ సంవత్సరం నుంచి ఈ కేసు విచారణ సీబీసీఐడీ చేపట్టింది. ఊటీ జిల్లా సెషన్స్ కోర్టులో కొనసాగుతున్న విచారణకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని పోలీసులు హాజరుపరిచారు. విచారణ సమయంలో వాదించిన సీబీసీఐడీ తరపు న్యాయవాది, కొడనాడు ఎస్టేట్ కేసు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వద్ద అదనంగా సమాచారం సేకరించాల్సి ఉందని, అందువల్ల విచారణ సమయాన్ని పెంచాలని కోరారు. ఆ తర్వాత ఈ కేసు విచారణను ఊటీ న్యాయస్థానం జూన్ 21వ తేదీకి వాయిదావేసింది. ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం కోవైలో ఉన్న సీబీసీఐడీ కార్యాలయంలో కేసుతో సంబంధాలున్న సయాన్ మిత్రుడు రవికుమార్, కూరగాయలు సరఫరా చేసిన దేవన్ సహా నలుగురు హాజరయ్యారు.

సికింద్రాబాద్-రామనాథపురం రైలు సేవల పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 30: సికింద్రాబాద్-రామనాథపురం రైలు సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.07695 సికింద్రాబాద్-రామనాథపురం ప్రత్యేక రైలు ఈ నెల 1,8,15,22,29, జూన్ 5,12,19,26 తేదీల్లో రాత్రి 9.10 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.45 గంటలకు రామనాథపురం చేరుకుంటుంది. మారుమార్గంలో నెం.07695 రామనాథపురం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 3,10,17,24,31, జూన్ 7,14,21,28 తేదీల్లో ఉదయం 9.50 గంటలకు రామనాథపురంలో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

టిక్కెట్ లేని ప్రయాణికులకు రూ.3.5 లక్షల జరిమానా

నగరంలో నడుస్తున్న సబర్బన్ రైళ్లలో టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారి నుంచి రూ.3.5 లక్షల జరిమానా వసూలుచేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలో నడుపుతున్న 264 సబర్బన్ రైళ్లలో సోమవారం ఒకేరోజు 160 మంది టిక్కెట్ చెకింగ్ అధికారులు, ఆర్పీఎఫ్ సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టిక్కెట్లు లేకుండా ప్రయాణిస్తున్న 1,300 మంది నుంచి రూ.3.5 లక్షల జరిమానా వసూలుచేసినట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.



ఓ యువకుడి చేతులపై నిలిచి నీటిలోకి దూకేందుకు సిద్ధమవుతున్న బాలుడు



బటర్‌ఫ్లై స్విమ్మింగ్ చేస్తున్న బడిపిల్లలు



నీటిలో డైవ్ చేస్తున్న యువకుడు

సెలవుల్లో ఆనందం.. మండువేసవిలో ఆహ్లాదం..

- ఈత కొడుతూ సేదదీరుతున్న యువతరం
- మెరీనా స్విమ్మింగ్‌పూల్‌లో యువకుల జలక్రీడ



సెల్ఫీ తీసుకుంటున్న యువకులు



యోగాసనం చేస్తున్న బాలుడు

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండతీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాధారణం కంటే మూడు డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు చల్లటి ప్రదేశాలకు తరలివెళుతున్నారు. ఇదిలా ఉండగా రాజధాని నగరంలో ఎండలు అధికం కావటంతో మెరీనాబీచ్ వద్దనున్న స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు విద్యార్థులు, యువకులు పోటీపడుతున్నారు. గత వారం రోజులుగా ఆ స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వస్తున్నవారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. నగరంలో నెలరోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో యాభైశాతం నగరవాసులు ఇంటిలోనే గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో వార్షిక సెలవుల్లో ఈత నేర్చుకునేందుకు బడిపిల్లలు మెరీనాబీచ్‌లో ఉన్న కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్ వద్ద బారులు తీరుతున్నారు. వీరంతా తమ స్నేహితులతో కలిసి స్విమ్మింగ్‌పూల్‌లో చేస్తున్న విన్యాసాలను చూసి అంతా ఆశ్చర్యపోతున్నారు. ఒకరిపై ఒకరు పల్టీలు కొడుతూ, ఒకరి భుజంపై నిలిచి నిట్టనిలువునా నీటిలో దూకుతూ, మోకాలి లోతు నీటిలో నిలిచి సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. కొందరు యువకులు నీటిపై యోగాసనం కూడా చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఈ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత నేర్చుకుండూ యువకులు హంగామా చేస్తున్నారు. బడిపిల్లలు, యువకులను ముందుగా పైపు నీటితో శుభ్రంగా స్నానం చేయించిన మీదటే స్విమ్మింగ్ పూల్‌లోకి అనుమతిస్తున్నారు.



స్విమ్మింగ్‌పూల్ ప్రవేశ ద్వారం వద్ద బాలుర కాళ్లు చేతులను నీటితో శుభ్రం చేస్తున్న సిబ్బంది





కౌంటర్‌లో టికెట్లు కొంటున్న యువకులు - స్విమ్మింగ్‌పూల్ వెలుపల రద్దీ

నడిగర్ సంఘానికి నెపోలియన్ రూ.కోటి విరాళం



నెపోలియన్

నడిగర్ సంఘం భవన నిర్మాణం కోసం సీనియర్ నటుడు, మాజీ ఎంపీ నెపోలియన్ కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ విషయాన్ని నడిగర్ సంఘం అధికారికంగా వెల్లడించింది. టి.నగర్, హబీబుల్లా రోడ్డులోని నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు ఇటీవల పునఃప్రారంభించిన విషయం తెల్సిందే. ఈ భవన నిర్మాణం కోసం పలువురు అగ్రహీరోలు, సినీ ప్రముఖులు తమవంతు విరాళాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా నెపోలియన్ కూడా కోటి రూపాయల విరాళాన్ని అందజేసినట్టు నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే సమయంలో ఈ భవన నిర్మాణం కోసం ప్రజల నుంచి ఏ రూపంలోనూ విరాళాలు సేకరించడం లేదని, అందువల్ల విరాళాల సేకరణకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ భవన నిర్మాణం కోసం అగ్రనటులు కమల్ హాసన్, ఉదయనిధి, విజయ్ వంటి వారు కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించగా, హీరో శివకార్తికేయన్ రూ.50 లక్షల విరాళాన్ని అందజేశారు. కాగా, కొన్నేళ్ళుగా అసంపూర్తిగా మిగిలివున్న ఈ భవన నిర్మాణ పనులను ఈ యేడాది ఆఖరు నాటికి పూర్తి చేయాలని నడిగర్ సంఘ కార్యవర్గం సంకల్పంతో ఉంది.

చిత్రజ్యోతి

గ్లామర్‌గా కనిపించేందుకే ఆ దుస్తులు

- మాళవికా మోహనన్



తనకు గ్లామర్ పాత్రలంటే అమితమైన ఇష్టమని, గ్లామర్‌గా కనిపించేందుకే అలాంటి దుస్తులను ధరిస్తానని హీరోయిన్ మాళవికా మోహనన్ అంటున్నారు. 'పేట' చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈమె... ఆ తర్వాత 'మాస్టర్', 'మారన్' వంటి చిత్రాల్లో నటించారు. చియాన్ విక్రమ్‌తో కలిసి 'తంగలాన్' చిత్రంలో నటించగా, ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఆమె సోషల్ మీడియాలో అభిమానులతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా వారు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. 'ఒక యువతి ప్రశాంతవదనంతో ఉంటూ గ్యాంగ్‌స్టర్‌గా నటించడం, కనిపించడం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. అదేసమయంలో నేను యాక్షన్ సన్నివేశాల్లో నటించేందుకు కూడా శిక్షణ కూడా తీసుకున్నాను. దీన్ని వ్యక్తీకరించడం కూడా సరదాగా ఉంటుంది. 'తంగలాన్' మూవీలో స్టంట్ సన్నివేశాల్లో నటించాను. యాక్షన్‌తో పాటు కథతో కూడి ఉంటుంది. ఈ సినిమా కోసం నేనే డబ్బింగ్ చెప్పాను. అయితే, రిలీజ్ తేదీ మాత్రం నాకు తెలియదు. మీకు తెలిస్తే చెప్పండి. నాకు గ్లామర్ అంటే అమితమైన ఇష్టం. అందుకే అలాంటి దుస్తులు ధరిస్తూ, గ్లామర్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తూ, ఫొటో షూట్‌లు చేస్తుంటా. చాలా మంది నా పెళ్ళిని చూడాలని ఆశపడుతున్నారు. నా పెళ్ళిపైనే మీకెందుకంత ఆసక్తి అంటూ ఆమె ప్రశ్నించారు.

ఆ నమ్మకంతోనే అంగీకరించా : రాశీఖన్నా



సుందర్ సి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'అరణ్మనై-4'. ఈ నెల 3న తమిళ, తెలుగు భాషల్లో విడుదల చేస్తున్నారు. తెలుగులో 'బాక్' అనే పేరు పెట్టారు. సుందర్ సి, తమన్నా, రాశీఖన్నా, రామచంద్రరాజు, కోవై సరళ, యోగిబాబు, వీటీవీ గణేష్ తదితరులు నటించారు. ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా రాశీఖన్నా మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం దర్శకుడు సుందర్ నన్ను సంప్రదించి కథ వినిపించేందుకు సిద్ధమయ్యారు. కానీ నేను మాత్రం కథ వినకుండానే ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించాను. నాకు హర్రర్ చిత్రాలంటే తమితమైన ఇష్టం. అలాంటి సినిమాల్లో షూటింగ్ పూర్తయిన తర్వాత చాలా ఎక్కువగా ప్రీప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులుంటాయి. ఇందులో తమన్నా చాలా అందంగా కనిపిస్తుంది, ఆమెతో కలిసి నటించడం గొప్ప అనుభూతినిచ్చింది. కామెడీ సన్నివేశాల్లో నటించడంలో కష్టపడ్డాను. అయినప్పటికీ సీనియర్ నటి కోవై సరళతో కలిసి హాస్య సన్నివేశాల్లో నటించడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు.

ఎల్లుండి పలు చిత్రాల విడుదల



'ది ప్రూఫ్'లో సాయి ధనిష్క

ఒక్క మే నెల మాత్రమే వేసవి సెలవులను పూర్తిగా ఎంజాయ్ చేసేందుకు అవకాశం ఉంది. అందుకే అనేక మంది నిర్మాతలు ఈ నెలలో తమ చిత్రాలను విడుదల చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో మే నెల మొదటి శుక్రవారమైన మూడో తేదీ ఐదు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో ఒకటి 'అరణ్మనై-4', 'అక్కరన్', 'కురంగు పెడల్', 'నింద్రు విలైయాడు', 'ది ప్రూఫ్' సినిమాలున్నాయి. వీటిలో ఒక్క 'అరణ్మనై-4'పై ప్రేక్షకులు ఆశలు పెట్టుకున్నారు. సుందర్ సి దర్శకత్వంలో వచ్చే చిత్రం కావడంతో పాటు తమన్నా, రాశీఖన్నా, యోగిబాబు వంటి నటీనటులు నటించారు. ఆ తర్వాత శివకార్తికేయన్ ప్రొడక్షన్ బ్యానరుపై తెరకెక్కిన 'కురంగు పెడల్' చిత్రం ఉంది. నాలుగు నెలలుగా సరైన హిట్ చిత్రం లేకపోవడంతో తమిళ చిత్రపరిశ్రమ బోసిబోయినట్టుగా కనిపిస్తుంది. మే నెలలో ఆ లోటు భర్తీ చేస్తుందన్న నమ్మకం ఇటు చిత్రపరిశ్రమతో పాటు అటు ప్రేక్షకుల్లో ఉంది.

మారియట్ బోన్‌వోయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక విహార యాత్రలు



మహాబలిపుం సమీపంలోని షెరటాన్ గ్రాండ్ చెన్నై రిసార్ట్

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మారియట్ బోన్‌వోయ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ వరకు 'రిసార్ట్ ఎస్కేప్స్' పేరుతో డెహ్రాడూన్ నుంచి గోవా వరకు, జైసల్మేర్ నుంచి షిల్లాంగ్ వరకు 20కి పైగా ఆకర్షణీయమైన ప్రదేశాల్లో కుటుంబ సమేతంగా సెలవుల్లో విహార యాత్రలను నిర్వహిస్తోందని ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ విహార యాత్రల్లో ఎంపిక చేసిన మారియట్ ప్రాపర్టీల్లో బసకు ప్రతిరోజూ రూ.2000ల వరకు హోటల్ క్రెడిట్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. స్పా చికిత్సపై 20 శాతం తగ్గింపు, 12 యేళ్ళలోపున్న పిల్లలకు 50 శాతం రాయితీ ఇనస్తున్నామని, అంతే కాకుండా మహాబలిపురం సమీపంలోని షెరటాన్ గ్రాండ్ చెన్నై రిసార్ట్ అండ్ స్పాలోను బసచేసే అవకాశం ఉంటుందని, బుకింగ్స్ తదితర వివరాలను 044- 71006000 అనే నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు. రిజర్వేషన్లకు అనే chennaiecr@sheraton.com వెబ్‌సైట్‌కు ఈమెయిల్ చేయాలని పేర్కొన్నారు.

ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్‌లో హృద్రోగ చికిత్సకు త్రీడీ ఇమేజింగ్ సిస్టమ్

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి వైద్యం అందించటంలో పేరొందిన ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్‌లో క్రమరహిత గుండె లయలకు (కార్డియాక్ అరిథ్మియాస్)కు కారణమైన అసాధారణ గుండె కణజాలను గుర్తించేదుకు ఎక్స్‌రే రహిత త్రీడీ మోడల్ ఆధారిత ఇమేజింగ్ సిస్టమ్ను ఉపయోగిస్తున్నట్లు ఆ హాస్పిటల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ టీఆర్ మురళీధరన్ తెలిపారు. ఇటీవల అపసవ్య హృదయ స్పందనలతో తీవ్ర అస్వస్థతకు గురైన 57 యేళ్ళ వ్యక్తికి వైద్య బృందం ఇమేజింగ్ సిస్టమ్ ఉపయోగించి అబ్లేషన్ చేసినట్లు తెలిపారు. ఈ విధానంతో చికిత్స చేయడం వల్ల రోగి త్వరగా కోలుకుంటాడని, హృదయ స్పందన విద్యుత్ ప్రేరణల శ్రేణి ద్వారా జరుగుతుందని, ఎలక్ట్రికల్ సిగ్నల్స్ సాధారణ ప్రవాహానికి అంతరాయం ఏర్పడినప్పుడు దడ వచ్చి, గుండె అధికంగా కొట్టుకుంటుందన్నారు. హృదయ స్పందన అధికం కావడానికి కారణమైన అసాధారణ కణజాలాలను గుర్తించడానికి త్రీడీ మోడల్ ఇమేజింగ్ సిస్టమ్ ఎంతగానో ఉపయోపడుతుందని చెప్పారు. ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి. సత్యనారాయణన్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యం అందిస్తున్న ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్‌లో హృద్రోగ చికిత్సకు త్రీడీ మోడల్ ఇమేజింగ్ సిస్టమ్ ఉపయోగించడంతో చిన్నారులు, గర్భిణీలు, వృద్ధులు ఎక్స్‌రే రేడియేషన్ కిరణాల వల్ల కలిగే ముప్పునుండి తప్పించుకోగలరన్నారు.



57 యేళ్ళ వ్యక్తికి చికిత్స అందించిన డాక్టర్ టీఆర్ మురళీధరన్, వైద్యనిపుణులు

61 మంది పోలీసు అధికారులకు పదవీ విరమణ వీడ్కోలు

పెరంబూర్, ఏప్రిల్ 30: నగర పోలీసు శాఖలో పనిచేస్తూ ఏప్రిల్ 30వ తేది పదవీ విరమణ పొందిన అధికారులు, పోలీసుల వీడ్కోలు సభ మంగళవారం జరిగింది. ఎగ్మూర్‌లోని గ్రేటర్ చెన్నై పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరై, పదవీ విరమణ చేసిన వారి సేవలు ప్రశంసించి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. పదవీవిరమణ చేసిన వారిలో ముగ్గురు అసిస్టెంట్ కమిషనర్లు, నలుగురు సీఐలు, 30 మంది ఎస్ఐలు, 23 మంది స్పెషల్ సబ్ ఇన్స్‌పెక్టర్లు, పోలీసులు మొత్తం 61 మంది తమ కుటుంబ సభ్యులతో కార్యక్రమంలో పాల్గొన్నారు.



పదవీవిరమణ చేసిన వారిని సత్కరిస్తున్న పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

ఆలయ వేడుకల్లో 300 మేకల బలి



బలి ఇచ్చిన మేకల మాంసాన్ని వంటకు సిద్ధం చేస్తున్న కార్మికులు

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని సామీపం కోప్పయ్యట్టి గ్రామంలోని పెరియదురైయాన్ ఆలయంలో చిత్తిరై వేడుకల సందర్భంగా 300 మేకలు బలిచ్చి భారీ స్థాయిలో మాసంహార విందు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఆ ఆలయంలో చిత్తిరై వేడుకల తీర్థ కలశాల ఊరేగింపు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆలయంలోని వినాయకుడు, కరుప్పణ్ణసామి, మూలవిరాట్టు, నవగ్రహ దేవతలకు ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో కీలక అంశంగా భక్తుల ఆలయానికి దానంగా ఇచ్చిన 300 మేకలను కరుప్పణ్ణసామికి బలిచ్చి అందరికీ మాంసాహార విందు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం వద్దే సుమారు రెండువేల మంది భక్తులు మాంసాహార విందు ఆరగించారు.

'లెట్స్ గెట్ ఎపిక్ విత్ అంకూర్ వరికూ'తో ఫిక్కీ ఎఫ్ఎల్‌వో అవగాహన



కార్యక్రమంలో ప్రముఖులు

అడయార్, ఏప్రిల్ 30: ఫిక్కీ ఎఫ్ఎల్వో సగర్వంగా 'లెట్స్ గెట్ ఎపిక్ విత్ అంకూర్ వరికూ' అనే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంకూర్ వరికూ ఒక ఎంటర్‌ప్రెన్యూర్ మాత్రమే కాకుండా కంటెంట్ క్రియేటర్. వైఫల్యాలతో పాటు పెట్టుబడి, లోతైన విశ్లేషణ, నిజాయితీతో కూడిన ఆలోచనలు, స్వీయ అవగాహన వంటి అంశాలు అంకూర్‌ను దేశంలోనే అత్యుత్తమ వ్యక్తిగత బ్రాండ్‌లో ఒకరిగా నిలబెట్టింది. యూట్యూబ్, లింక్డ్‌ఇన్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో కలిపి 10.6 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ కలిగివుండి దేశంలోనే అగ్ర కంటెంట్ సృష్టికర్తల్లో ఒకరిగా ఉన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్నారు. 3.60 లక్షల మంది విద్యార్థులతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కెరీర్ మేనేజ్‌మెంట్, పర్సనల్ గ్రోత్ వంటి అంశాలపై కోర్సులు నిర్వహించారు. ఎఫ్ఎల్‌వో చెన్నై సీఎంప దివ్య అభిషేక్ సారథ్యంలో అంకూర్ వరికూను గ్రోత్ మైండ్ సెట్ అంశంపై ప్రసంగించేందుకు ఆహ్వానించారు.

జన కేతనం

ఇదీ మందు

రోజాపై మరో రోజా పోటీ





నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరఫున రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా పోటీ చేస్తుండగా ఇండిపెండెంట్‌గా అదే పేరుతో మరో అభ్యర్థి కే. రోజా బరిలోకి వచ్చింది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన కే.రోజా పోటీ చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించిన లిస్ట్‌లో ఉంది. దీంతో వైసీపీ వర్గాల్లో అయోమయం నెలకొంది. ఈమెకు కుట్టుమిషన్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. ఇద్దరి పేరు ఒకేలా ఉండడంతో వారు తల పట్టుకుంటున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేరు సరిపోలే విధంగా వైసీపీ నాయకులు భానుప్రకాష్ పేరున్న మరో వ్యక్తితో నామినేషన్ దాఖలు చేయించారు. అది స్క్రూటినీలో తిరస్కారానికి గురికావడంతో వారి ప్లాన్ బెడిసికొట్టింది. అలాగే జ్ఞానప్రకాష్ పేరుతో మరో నామినేషన్ కూడా వేయించారు. ఇది సక్రమంగా ఉండడంతో ఆ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు ఒకటో నెంబర్ కేటాయించగా జ్ఞాన ప్రకాష్‌కు నాలుగవ నెంబర్ రావడంతో వైసీపీ పాచిక పారలేదనే ప్రచారం జరుగుతోంది. పేర్లతో ఓటర్లను తికమకకు గురిచేయాలనే వైసీపీ ప్రయత్నాలు ఫలించలేదు.

- పుత్తూరు అర్బన్

అసెంబ్లీ బరిలో వారసులు



తిరుపతి జిల్లా ఎన్నికల బరిలో ఈసారి ప్రధాన పార్టీల తరఫున వారసులు తలపడుతున్నారు. ఏడింటా ఆరు నియోజకవర్గాల నుంచి వీరు పోటీలో నిలిచారు. నలుగురు ఈ అసెంబ్లీ ఎన్నికల నుంచే అరంగేట్రం చేస్తున్నారు. మరో ఇద్దరు మాత్రం రెండోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తిరుపతి సిటింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఈ పర్యాయం తాను పోటీ నుంచి తప్పుకొని తనయుడు, నగర డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి అవకాశం కల్పించారు. అధికార వైసీపీ నుంచి ఈయన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో తలపడుతున్నారు. తిరుపతి పొరుగు నియోజకవర్గం చంద్రగిరి సిటింగ్ వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తూ ఇక్కడి నుంచి తనయుడు మోహిత్‌రెడ్డిని నిలబెడుతున్నారు. మోహిత్ తొలిసారి వైసీపీ నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. నగరి నియోజకవర్గం నుంచి దివంగత మాజీ మంత్రి ముద్దు కృష్ణమనాయుడు తనయుడు భానుప్రకాష్ నిలబడుతున్నారు. తన తండ్రి మరణానంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఈయన వైసీపీ అభ్యర్థి ఆర్కే రోజా చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి కూడా భానుప్రకాష్ వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజాను ఢీకొంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వారసుడిగా ఆయన కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా రెండోసారి తన పాత ప్రత్యర్థి,సిటింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డితో తలపడుతున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, ఎమ్మెల్యే అయిన నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె, యువ వైద్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పోటీ పడుతున్నారు. వెంకటగిరి నుంచి కూడా రాజకీయ వారసుడే వైసీపీ పక్షాన పోటీ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడు రాంకుమార్ తొలిసారి ఎన్నికల్లో పోటీపడుతున్నారు. ఈ అరుగురు వారసుల్లో ఓటర్లు ఎవరికి పట్టం కట్టి అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టిస్తారో చూడాల్సిందే.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)



సగం పనులతో ఆగిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

క్రీడాకారుల ఆశలతో ఆటలు

'మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రగిరి ప్రభుత్వ కళాశాలలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుచేస్తాం'
గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇది.


చంద్రగిరిలో క్రికెట్ అభిమానులకు నిరాశే మిగిలింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హామీ కార్యరూపం దాల్చకపోవడంతో క్రికెట్ స్టేడియం ఏర్పాటు కలగానే మిగిలింది. 1936లో చంద్రగిరిలో ఏర్పాటైన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 520 మంది చదువుతున్నారు. పక్కనే ఉన్న ఇంటర్ కళాశాలలో మరో 480 మంది చదువుతున్నారు. చంద్రగిరితో పాటు చుట్టుపక్కల గ్రామాల క్రీడాకారులకు సరైన గ్రౌండ్ లేకపోవడంతో ఇతర జిల్లాలపై ఆధారపడుతూ వచ్చారు. ఇక్కడి పాఠశాల పక్కనే ఉన్న మూడున్నర ఎకరాల గ్రౌండ్‌లో క్రికెట్ స్టేడియం కట్టాలని స్థానిక యువత ఎప్పటి నుంచో విజ్ఞప్తి చేస్తూ వస్తోంది.ఈక్రమంలో యువత ఓట్లకు గాలం వేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంకల్పించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని మాటిచ్చారు. అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో కనీసం ఆవైపు చూసిన సందర్భాలు కూడా లేవు.

నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

పాఠశాల వెనుకభాగంలోని రెండున్నర ఎకరాలలో గత టీడీపీ ప్రభుత్వం మొదలుపెట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలో ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రాల పేరుతో ఓ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2018లో చంద్రగిరి ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు రూ.1.8 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించింది. స్టేడియంలో 2 బాడ్మింటన్ కోర్టులు, కోచ్‌రూం, జిమ్‌రూం, టాయిలెట్స్, డార్మిటరీలకు ప్లాన్ సిద్ధం చేశారు. ఇక టోర్నమెంట్లకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చంద్రగిరి క్రీడాకారులతో పాటు పాకాల, ఎర్రవారిపాలెం, చిన్నగొట్టిగల్లు, రామచంద్రాపురం, తిరుపతిరూరల్ యువత సంబరపడ్డారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం వచ్చింది. నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహించింది. సంబంధిత కాంట్రాక్టర్ అప్పటికే రూ.కోటితో దాదాపు సగం పనులు పూర్తిచేశారు. నిధుల విషయంలో కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. పనులను మధ్యలో వదిలేశారు. దీంతో ఇండోర్ స్టేడియం కూడా ఏర్పాటు కాలేదని క్రీడాకారులు వాపోతున్నారు.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

గత ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎడాపెడా హామీలిచ్చేశారు. విజయమే లక్ష్యంగా సాధ్యాసాధ్యాలను పట్టించుకోకుండా అడగనోడిదే పాపం అన్నట్టుగా మాటిచ్చేశారు. అధికార పార్టీ తరఫున గెలిచారు కాబట్టి తమ ఎమ్మెల్యే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతారని నియోజకవర్గ ప్రజలు నమ్మారు. గెలిచాక ప్రజలకిచ్చిన హామీలను పక్కన పెట్టేశారు. అయిదేళ్లూ ఏ మాటా నిలబెట్టుకోకుండానే గడిపేశారు. దీంతో ఎమ్మెల్యేపై ఇక్కడి ప్రజానీకం ఆగ్రహంతో ఉంది. అమలు చేయని హామీలలో ఇవికొన్ని...



చంద్రగిరి చెవిలో

చెవిరెడ్డి పువ్వులు

కందకమూ.. ఎక్కడా ?

● రైతన్నలకు తప్పని ఏనుగుల బెడద



ఏనుగుల సంచారంతో నాశనమైన మామిడి చెట్లు

వ్యవసాయ భూములను ఏనుగులు ధ్వంసం చేయకుండా కందకాలు ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరలేదు. రైతులకు ఏనుగుల తలనొప్పి ఇప్పటికీ తగ్గలేదు. అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే చెవిరెడ్డి కందకాల మాటే ఎత్తలేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, రేణిగుంట సమీపంలోని మండల్లోని పంచాయితీలు చాలా వరకు శేషాచల అడవులకు సమీపంలో ఉన్నాయి. దాదాపు 15 వేల ఎకరాలకుపైగానే పొలాలు అడవికి దగ్గరగా ఉన్నాయి. సమీపంలోని గ్రామ రైతులు మామిడి, వరి, టమోట, కొబ్బరిచెట్లు పెంపకంపై ఆధారపడుతుంటారు. అడవికి సమీపంలో పొలాల్లో నిత్యం ఏనుగుల గుంపు సంచరిస్తుండటంతో పంటలు నాశనమవుతున్నాయి. పంట నష్టంతో పాటు ప్రాణనష్టం, ఏనుగుల దాడిలో గాయపడిన వారి సంఖ్య కూడా అధికమే. దాదాపు 20 నుంచి 25 ఏళ్ల పాటు పెంచిన మామిడిచెట్లను కూడా భారీగా నష్టపోయిన సందర్భాలున్నాయి. తమ సమస్యను పరిష్కరించాలంటూ ఏన్నోఏళ్లుగా రైతులు ప్రభుత్వానికి విన్నవించుకుంటూనే ఉన్నారు. ఈక్రమంలో గతంలో పాదయాత్ర సందర్భంగా జగన్‌తో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కందకాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెవిరెడ్డి అటుగా వెళ్లి చూడటం కానీ, కనీసం ఈ అంశంపై చర్చించిన పాపాన పోలేదని రైతులు విమర్శిస్తున్నారు

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

మురుగులో కొట్టుకుపోయిన హామీ

చంద్రగిరికి భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు హామీకే పరిమితమయ్యింది. తాను మళ్లీ గెలిచిన వెంటనే చంద్రగిరి మేజర్ పంచాయతీకి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌ను ఏర్పాటు చేస్తానని గత ఎన్నికల సమయంలో వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన హామీ అటకెక్కింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈఅంశంపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. చంద్రగిరి పంచాయతీలో దాదాపు 26 వేల జనాభా నివసిస్తున్నారు. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేక మురుగునీటి సమస్య ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. స్థానికుల ఇళ్ల వద్ద, కాలనీల్లో ఏర్పాటు చేసుకున్న కాలువల ద్వారా డ్రైనేజ్ నీరు ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల చెట్లు, రాళ్లు, మట్టిపెళ్లలతో ఈడ్రైనేజ్ నీరు ముందుకు వెళ్లలేక నిలిచిపోతోంది. కాలువలను శుభ్రపరిచిన సందర్భాల్లో మురుగు వెంకటంపేట, నూకలగుంట వంటి ప్రాంతాలో ఆగిపోతోంది. వర్షం కురిస్తే మురుగు వర్షపునీటితో కలిసిపోయి ఇళ్లమధ్యలోనే ప్రవహిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సందర్శించి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజయనగర్ కాలనీలో భూగర్భడ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనను మళ్లీ గెలిపిస్తే విజయనగర్ కాలనీ మాత్రమే కాకుండా చంద్రగిరి మేజర్ పంచాయతీ మొత్తానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రజలను నమ్మించారు. అధికారంలోకి వచ్చిన చెవిరెడ్డి ఆ తర్వాత ఆ మాటే ఎత్తలేదు. పలుమార్లు స్థానిక ప్రజలు డ్రైనేజ్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళితే 'చూస్తాం, చేస్తాం' అనే మాటలకే పరిమితమయ్యారు.

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)





వెంకటంపేటలో అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజ్ కాలువలు



రాయలచెరువు...

చెరువుకట్ట దాటని మాట


● మరమ్మతులకు నోచుకోని రాయలచెరువు

జిల్లాలో అతిపెద్దదైన రాయలచెరువు కట్ట అభివృద్ధి చేస్తానన్న ఎమ్మెల్యే మాట నీటిమూటే అయిందంటున్నారు ఇక్కడి ప్రజానీకం. 2021 నవంబరులో భారీ వర్షాలకు చెరువు కట్ట కొంతమేర కుంగింది. చెరువు తెగుతుందేమోనని కట్టకింద ఉన్న 20 గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని తలో దిక్కూ పారిపోయారు. నాటి జల ప్రళయానికి సుమారు 17 రోజుల పాటు ప్రజలు ఆర్‌సీపురం మండల కేంద్రానికి చేరుకోలేకపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మమ అనిపించారు. ఇలాంటి పరిస్థితి మరోసారి ఎదురుకాకుండా రాయలచెరువు కట్టను రూ.8 కోట్లతో పటిష్ఠ పరచి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి కూడా నిధులు కోసం ప్రతిపాదనలు పంపారు. మూడేళ్లు గడుస్తున్నా ఆ ఊసే లేదు. చెరువు కట్టను పూర్తిగా ముళ్లపొదలు కమ్మేశాయి. రాయలచెరువు ఒకసారి నిండితే ఐదేళ్ల పాటు ఆర్‌సీపురం మండల ప్రజలకు సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇలాంటి చెరువును తమ ఎమ్మెల్యే పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- రామచంద్రాపురం

సూళ్లూరుపేట చరిత్ర

విశిష్టతల కోట



ఆసియాలోనే అతిపెద్ద పులికాట్ ఉప్పునీటి సరస్సు.. అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనాకేంద్రం షార్.. దేశవిదేశాలకు చెందిన పక్షుల విడిది నేలపట్టు ..పేరెన్నికగన్న పరిశ్రమలు కొలువుదీరిన శ్రీసిటీ సెజ్...ఇలా ఎన్నో విశేషాల సమాహారం సూళ్లూరుపేట నియోజకవర్గం. 13 సార్లు నియోజకవర్గంలో ఎన్నికలు జరగగా, కాంగ్రెస్, టీడీపీలు చెరో ఐదేసిసార్లు విజయం సాధించాయి. వైసీపీ రెండుసార్లు గెలిచింది. ఈ నియోజకవర్గం ఏర్పడ్డాక మహిళలెవరూ ప్రాతినిధ్యం వహించలేదు. రెండుసార్లు పోటీ చేసినా గెలవలేదు. పసల పెంచలయ్య, పరసా వెంకటరత్నంలు మాత్రమే మంత్రులుగా పనిచేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండే ఈ నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం తరువాత పరిస్థితి మారిపోయింది. టీడీపీ ఆధిపత్యం సాగింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మొదటి ఎన్నికల్లో ప్రస్తుత సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు వెంకటగిరి నియోజకవర్గంలో కలసి ఉండేవి. 1962 నియోజకవర్గాల పునర్ విభజనతో సూళ్లూరుపేట విడిగా నియోజకవర్గంగా ఏర్పడింది.

-తడ

నియోజకవర్గం ఏర్పడింది: 1962
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 13
నియోజకవర్గం పరిధిలోని మండలాలు : సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ, దొరవారిసత్రం, పెళ్లకూరు,ఓజిలి

ఎమ్మెల్యేలు

1962	పసుపులేటి సిద్దయ్యనాయుడు	కాంగ్రెస్
1967	పిట్ల వెంకటసుబ్బయ్య	ఇండిపెండెంట్
1972	పిట్ల వెంకటసుబ్బయ్య	కాంగ్రెస్
1978	పిట్ల వెంకటసుబ్బయ్య	కాంగ్రెస్
1983	సట్టి ప్రకాశం	టీడీపీ
1985	మదనంబేటి మణెయ్య	టీడీపీ
1989	పసల పెంచలయ్య	కాంగ్రెస్
1994	పరసా వెంకటరత్నం	టీడీపీ
1999	పరసా వెంకటరత్నం	టీడీపీ
2004	నెలవల సుబ్రహ్మణ్యం	కాంగ్రెస్
2009	పరసా వెంకటరత్నం	టీడీపీ
2014	కిలివేటి సంజీవయ్య	వైసీపీ
2019	కిలివేటి సంజీవయ్య	వైసీపీ

ఓటర్లు
మొత్తం : 2,41,124
పురుషులు: 1,17,367
మహిళలు 1,23,733
ఇతరులు : 24

రాష్ట్రం కోసం రాజకీయ ప్రచారం

శ్రీకాళహస్తిలో సందడి చేస్తున్న పల్లమాల సుధాకర్



'మొగలిరేకులు', 'చక్రవాకం' అనే పేర్లు వినగానే పల్లమాల సుధాకర్, మంజులా నాయుడు గుర్తుకువస్తారు. తెలుగు టీవీ సీరియల్స్‌లో ట్రెండ్ సెట్టర్స్‌గా ఈ దంపతులకు ప్రత్యేక స్థానం ఉంది. పాపానాయుడుపేటలోనే మొగిలిరేకులు కి శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పల్లమాల సుధాకర్ కొద్ది రోజులుగా ప్రచారంలో కనిపిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం కోసం తమ బంధుమిత్రులందరినీ సమీకరిస్తున్నారు. ప్రతి రోజూ వివిధ వర్గాలతో మంతనాల్లో బిజీగా ఉంటున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వీరు మొత్తం కుటుంబం అంతా ఎన్నికల కోసమే 20 రోజుల కిందట శ్రీకాళహస్తికి వచ్చేశారు. ఎందుకిలా అనడిగితే పల్లమాల సుధాకర్ ఇలా చెబుతున్నారు.. "ప్రస్తుతం రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలు ఎంతో బాధ కలిగించాయి. విలువలు గాడి తప్పాయి. అభివృద్ధి కనుమరుగైపోయింది. భావితరాల భవిష్యత్తుపై అంధకారం అలముకుంది.. కొత్తగా వచ్చే భూచట్టం పేరు వింటేనే రైతులు వణికి పోతున్నారు. ఇలాంటి దారుణ పరిస్థితులపై సామాజిక స్పృహతో స్పందించాలనిపించింది. రామాయణంలో ఉడుత సహాయం గుర్తుకు వచ్చింది. సమాజంలో మంచిని బతికించుకోవడం కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నాను. పవన్‌కళ్యాణ్ ఆశయాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రం తిరిగి గాడిలోపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. శ్రీకాళహస్తి ప్రాంతానికి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎంతో సేవ చేశారు. ఆయన కుమారుడి విజయం కోసం పనిచేసి గోపాలన్న రుణం తీర్చుకోవాలనుకున్నాను. ఈ ప్రాంతంలో నా ఆత్మీయులు అసంఖ్యాకంగా ఉన్నారు. వారందరినీ చైతన్యపరుస్తున్నాను." పల్లమాల సుధాకర్ 2009లో శ్రీకాళహస్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు కూడా. ప్రజారాజ్యం లోనూ చురుగ్గా వ్యవహరించారు.

- శ్రీకాళహస్తి